సాక్షి వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



అధికారమే.. అండగా!

అధికారమే అండగా టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. వారి ఆదేశాల మేరకు అధికారులు సైతం వైఎస్సార్‌సీపీ నాయకులే లక్ష్యంగా వేధింపులకు పాల్పడుతున్నారు. - 8లో



అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయండి

అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని చింతలజూటూరు గ్రామానికి చెందిన కూటమి నాయకులు గురువారం వేముల పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/17.8

జిల్లాలో గురువారం 17.8 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదైంది.గంటకు 2.5 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లా ఆస్పత్రి తనిఖీ

ప్రొద్దుటూరు క్రైం: వైద్య విధాన పరిషత్ జాయింట్ కమిషనర్ రమేష్ కిశోర్, డాక్టర్ స్వప్న సింధులు గురువారం జిల్లా ఆస్పత్రిని పరిశీలించారు. జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుతో కలిసి ఆస్పత్రిలోని వార్డులు, ఓపీ విభాగం, ఫార్మసీ విభాగాన్ని వారు తనిఖీ చేశారు. ఓపీలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే సిటి, ఎమ్మార్ఐ విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ నియామకం



రాజేశ్వరరావు

కడప అర్బన్: కడప కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారిగా రాజేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన కడప కేంద్ర కారాగారం ఇన్‌చార్జి అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేసిన ప్రకాష్‌ను నెల్లూరుకు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న రాజేశ్వరరావుకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. అయితే ఆయనను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో రాణించిన క్రీడాకారులు

ప్రొద్దుటూరు: కాకినాడలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరిగిన 1వ ఎన్టీఆర్ మెమోరియల్ తైక్వాండో ఛాంపియన్ షిప్–2025 పోటీల్లో కడప జిల్లా ఓవరాల్ రన్నర్ అప్ సాధించింది. ఈ పోటీల్లో కడప జిల్లా మొత్తం 9 స్వర్ణ, 4 రజత, 4 కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్‌లు కమల్, రాజేష్ తెలిపారు. స్వర్ణ పతకాలను ఈశ్వరి, మహిత, సత్యభామ, హాసిక, కీర్తన, దినేష్, తనీష్, విజయ్ సుందర్ రాజు, జి.హేమ, రజత పతకాలను నిహాల్, తేజస్వి, త్రివేణి, మోక్షిత, కాంస్య పతకాలను భరత్, ఫరియా, శ్యామ్, యోగి సాధించినట్లు వివరించారు. ఈ పోటీల్లో విన్ తైక్వాండో అకాడమీ కీలకపాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. విజేతలను ఏపీఎస్పీడీసీఎల్ బీసీ సంఘం ప్రెసిడెంట్ మురళీమోహన్ అభినందించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పక్కాగా నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జనరల్ ప్రాక్టికల్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని ఇంటర్మీడియేట్ ఆర్జేడీ రవి పేర్కొన్నారు. గురువారం కడపలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సంబంధించి సైన్స్ జూనియర్ లెక్చరర్లకు పరీక్షల విధి విధానాలు, మార్కుల గురించి ఇంటర్ ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో ఒకేషనల్ ప్రాక్టికల్స్ జరుగుతున్నాయన్నారు. పదోతేదీ నుంచి జనరల్ ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయన్నారు. జనరల్ ప్రాక్టికల్స్‌కు జిల్లాలో 78 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇంటర్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఆరోపణలకు తావు లేకుండా చూడాలని లెక్చరర్లకు సూచించారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్ మురళీ,సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో విరసం రాష్ట్ర సాహిత్య పాఠశాల



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు: విప్లవ రచయితల సంఘం(విరసం) 25వ రాష్ట్ర సాహిత్య పాఠశాల ఈనెల 8, 9 తేదీల్లో కర్నూలులోని వెంకటాద్రి నగర్ వెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.వరలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక సృజన సామాజిక వేదిక కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ప్రముఖ కథా రచయిత దాదాహయాత్ విడుదల చేశారు. రెండు రోజుల సాహిత్య పాఠశాలను, సభలను విజయవంతం చేయాలని రచయితలు, కవులు, కళాకారులు, ఉద్యమాభిమానులకు, ప్రజాస్వామిక వాదులకు పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● 60 ఏళ్ల అనుబంధం

ఒక్క నిర్ణయంతో అంతం

- దక్షిణ మధ్య రైల్వేతో తెగిన ఆరు దశాబ్దాల అనుబంధం
- జోన్ హద్దులపై రైల్వేబోర్డు స్పష్టత
- గుంతకల్ డివిజన్ సౌత్‌కోస్ట్ జోన్‌లోకి బదిలీ
- ఇకపై విశాఖ జోన్ కేంద్రంగానే రైల్వేపాలన
- కొత్త జోన్‌లో విలీనంపై రైల్వే కార్మికుల్లో అసంతృప్తి



ముంబయి - చెన్నై రైలు మార్గంలోని కడప రైల్వేస్టేషన్

రాజంపేట: ఆరు దశాబ్దాల తర్వాత ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పరిధిలో ఉన్న దక్షిణ మధ్య రైల్వే(సౌత్ సెంట్రల్ రైల్వే) జోన్‌తో రాయలసీమ సీమ రైల్వేలకు కేంద్రంగా ఉన్న గుంతకల్ రైల్వే డివిజన్ బంధం తెగిపోనుంది. ముంబయి–చెన్నై ప్రధాన రైలు మార్గం కడప, అన్నమయ్య జిల్లాల మీదుగా వెళుతోంది. సౌత్‌కోస్ట్ రైల్వేజోన్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో సరిహద్దులపై రైల్వేబోర్డు స్పష్టత ఇచ్చేసింది. ఇందులో భాగంగా రైల్వే మంత్రిత్వశాఖ విశాఖ కేంద్రంగా పనిచేసే సౌత్ కోస్ట్ రైల్వేజోన్‌లోకి గుంతకల్ డివిజన్‌ను విలీనం చేసే దిశగా చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. కాగా ప్రస్తుతం గుంతకల్ డివిజన్ పరిధిలోని రాయచూరు నుంచి వాడి (వాడి మినహా) రైల్వేసెక్షన్‌ను సికింద్రాబాద్ డివిజన్‌లోకి మార్చే అవకాశాలు ఉన్నాయి.

విశాఖ జోన్‌లోకి బదిలీపై వ్యతిరేకత

విశాఖ జోన్‌లో గుంతకల్ డివిజన్ విలీనంపై కార్మికుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. డివిజన్ కేంద్రం నుంచి సౌత్‌కోస్ట్ జోన్ కేంద్రమైన విశాఖకు వెళ్లాలంటే 700 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి ఉంటుంది. జోన్‌కు వెళ్లి రావాలంటే కనీసం ఐదు రోజులు పడుతుంది. ప్రస్తుత జోన్ కేంద్రానికి వెళ్లాలంటే 200 కిలోమీటర్ల దూరం ఉంది. విశాఖ జోన్ వద్దు..సికింద్రాబాద్ జోన్ ముద్దు అంటూ కార్మికులు నినదిస్తున్నారు.

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రైలు మార్గాల చరిత్ర

మార్గం	సంవత్సరం
రేణిగుంట–రెడ్డిపల్లె	1864
రెడ్డిపల్లె–కడప	1865
కడప–ముద్దనూరు	1866
ముద్దనూరు–తాడిపత్రి	1898



రైల్వే డివిజన్ చరిత్ర...



దక్షిణ రైల్వే జోన్‌లో భాగంగా గుంతకల్లు రైల్వే డివిజన్ 1956 సంవత్సరంలో రూపొందించారు. దీనిని 1997 అక్టోబరు 2న దక్షిణ మధ్య రైల్వేజోన్‌కు బదిలీ చేశారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో ప్రజలకు తన సేవలందిస్తూ వచ్చింది. ఇప్పుడు సౌత్‌కోస్ట్ జోన్‌లోకి వెళ్లిన తర్వాత సరిహద్దులు మార్పులు చేర్పులు జరగబోతున్నాయి.

ప్రస్తుత పరిధి: ఆంధ్రప్రదేశ్‌లో 120.51 రూట్ కి.మీ దూరం, కర్ణాటకలో 142.2 రూట్ కి.మీ దూరం పరిధి, తమిళనాడులో 6.86 కి.మీ మొత్తం దూరం పరిధి ఉంది. గుంతకల్లు జంక్షన్, రేణిగుంట జంక్షన్, కడప, అనంతపురం, యాదగిరి, రాయచూరు, చిత్తూరు, ధర్మవరం, గుత్తి, పాకాల, నందలూరు, డోన్, ఆదోని, మంత్రాలయం, శ్రీకాళహస్తి, కదిరి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, రాజంపేట, కోడూరు, నారాయణపేటరోడ్, వెంకటగిరి, కృష్ణా, నల్వార్‌లతోపాటు 90 స్టేషన్లు ఉన్నాయి. విశాఖజోన్ కేంద్రంగా రైల్వేపాలన జరగనుంది. ప్రస్తుత అధికార పరిధిలో కూడా మార్పులు జరగనున్నాయి.

గుంతకల్ రైల్వే డివిజన్ చరిత్ర అపూర్వం



రాయలసీమ రైల్వేలకు నిలయమైన గుంతకల్ రైల్వేడివిజన్ చరిత్ర అపూర్వం. దక్షిణమధ్య రైల్వేకి ఆదాయం తీసుకొచ్చే డివిజన్‌గా పేరుంది. ఆరు దశాబ్దాలుగా గుంతకల్ రైల్వే డివిజన్ దక్షిణ మధ్యరైల్వేలో ఉండి సేవలందించింది. అన్ని విధాలుగా గుంతకల్ డివిజన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. సౌత్ సెంట్రల్ రైల్వేజోన్‌తో ఉన్న అనుబంధం ఆరు దశాబ్దాల తర్వాత తెగిపోతుండటం విచారకరం. – బీఎంబాషా, డివిజన్ ప్రెసిడెంట్, మజ్దూర్ యూనియన్, గుంతకల్

కొత్త జోన్‌తో పాటు బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలి



విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ జోన్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో బాలాజీ డివిజన్‌ను ఏర్పాటు చేయాలి. దక్షిణ మధ్య రైల్వే నుంచి గుంతకల్ డివిజన్ సౌత్ కోస్ట్ జోన్‌లోకి వెళుతోంది. అలాంటప్పుడు కడప వరకు తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్‌ను తీసుకు రావాల్సిన అంశంపై పాలకులు దృష్టి సారించాలి. ఇప్పటికే ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, గురుమూర్తి, మేడా రఘునాథరెడ్డిలు తిరుపతి బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. –తంబళ్ల వేణుగోపాల్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు, రాజంపేట

గుంతకల్ డివిజన్‌కు ఘనమైన చరిత్ర



గుంతకల్ డివిజన్‌కు ఆరు దశాబ్దాల ఘనమైన చరిత్ర ఉంది. ముంబయి–చెన్నై ప్రధాన రైలుమార్గం వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల మీదుగా వెళుతోంది. ఇప్పుడు సౌత్‌కోస్ట్ జోన్‌లోకి డివిజన్ బదిలీ చేసేందుకు రైల్వేబోర్డు సర్వం సిద్ధం చేస్తోంది. అలాంటప్పుడు బాలాజీ డివిజన్ ఏర్పాటుచేసి, కనీసం నందలూరు వరకు తీసుకోవాలన్న ప్రతిపాదనను రైల్వేబోర్డు పరిశీలించాలి. గతంలో సదరన్ రైల్వేతో నందలూరుకు ప్రత్యేక అనుబంధం ఉంది. అది గుర్తించాలి. –తల్లెం భరత్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యుడు, రైల్వేకోడూరు

అనురాగ్ ప్రీతమ్‌కు ఇంటర్నేషనల్ క్లాసికల్ చెస్ రేటింగ్



కడప ఎడ్యుకేషన్: కడపకు చెందిన 13 ఏళ్ల మేకల అనురాగ్ ప్రీతమ్ ఫిడే ఇంటర్నేషనల్ క్లాసికల్ చెస్ రేటింగ్ అందుకున్నాడు. జనవరి 2025లో చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన చెన్నై ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో అనురాగ్ ప్రీతమ్ పాల్గొని రేటెడ్ ప్లేయర్స్‌పై 2.5 పాయింట్లు స్కోరు చేసి ప్రతిభ కనబరిచాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య(ఫిడే) ఫిబ్రవరి రేటింగ్ లిస్టులో అనురాగ్ ప్రీతం రేటింగ్‌ను ప్రకటించింది. వైఎస్సార్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారీ అనురాగ్‌ప్రీతమ్‌కు అభినందనలు తెలిపారు.

సత్వర చికిత్సాకేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్: పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించి సత్వర చికిత్సా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి. శ్రీదేవి సూచనల మేరకు కడపలోని రిమ్స్ ఆవరణలో 'జిల్లా సత్వర చికిత్స కేంద్రం'ను తమ టీం సభ్యులతో సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10 తేదీ నుంచి 24వ తేదీ వరకు సత్వర చికిత్స విధానాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కడప, ప్రొద్దుటూరు జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ అధికారి రమేష్, ప్రోగ్రాం మేనేజర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ప్రగతే పి–4 పాలసీ లక్ష్యం

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటినీ ప్రగతి పథంలో నడిపించి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పి–4 పాలసీని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా దూరం చేసే దిశగా ప్రభుత్వం ప్రాధాన్యతతో అమలు చేయనున్న పి–4 ప్రణాళికపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగా హాలు నుంచి కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్, జెడ్పీ సీఈవో ఓబులమ్మ, సీపీఓ హాజరత్తయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జీరో పావర్టీని సాధించే దిశగా ముఖ్యమంత్రి రానున్న ఉగాది నాడు ప్రారంభించ తలపెట్టిన పి–4 (పబ్లిక్ పీపుల్ ప్రయివేట్ పార్టనర్ షిప్) పాలసీ అమలు పై గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించనున్నట్లు చెప్పారు. ఎన్జీవోలు, ఎన్ఆర్ఐలు, వ్యాపారస్తులు, స్థానిక నాయకులు వివిధ రంగాల నిపుణుల భాగస్వామ్యం, వారి నైపుణ్యం, వనరులు, మార్గదర్శకత్వాన్ని పంచుకోవడం ద్వారా పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



ఉత్కంఠ భరితంగా సాగిన కబడ్డీ పోటీలు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండలంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట కళాశాలలో నిర్వహిస్తున్న 11వ క్రీడా, సాంస్కృతిక పోటీలు గురువారం ఉత్కంఠ భరితంగా సాగాయి. కబడ్డీ, బ్యాడ్మింటన్, త్రోబాల్, టేబుల్ టెన్నిస్, పరుగు, హైజంప్ పోటీలు నిర్వహించారు. అనంతరాజుపేట బాలికల జట్టు కబడ్డీలో ఫైనల్స్‌కు చేరింది బాలుర వాలీబాల్, బాలికల త్రోబాల్‌లో కూడా ఇదే కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. నాలుగు వందల మీటర్ల బాలుర పరుగు పందెంలో వీఆర్ గూడెం విద్యార్థి అనిల్ కుమార్ విజేతగా నిలిచాడు. బాలికల నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో వీఆర్ గూడెంకు చెందిన యమున, అనూష, అనంతరాజుపేటకు చెందిన షమీరా బహుమతులు గెలుచుకున్నారు.

చక్రస్నానం.. సర్వపాపహరణం



దేవతామూర్తులకు గంధాభిషేకం



పుష్కరిణిలో చక్రస్నానం చేయిస్తున్న వేద పండితులు

వైభవంగా ధ్వజావరోహణం....

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు గురువారం స్వామి, అమ్మవార్లకు అవభృథ స్నానం, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు తీర్థస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి మేళతాళాలతో ప్రత్యేక పల్లకీలో స్వామి, అమ్మవార్లతో పాటు శ్రీ చక్రాన్ని ఊరేగింపుగా పుష్కరిణి మండపానికి చేర్చారు. అక్కడ రెండున్నర గంటలపాటు వేద మంత్ర యుక్తంగా స్వామి, అమ్మవార్లకు పంచామృతం,ఇతర ద్రవ్యాలతో అభిషేకించారు. వేద పండితుల మంత్రోచ్చాటనల మధ్య కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత చందన లేపనం, నారికేళ జలాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల బృందం పాలు, పెరుగు, తేనె, శుద్ధ జలాలతో కూడా ప్రత్యేకంగా అభిషేకం చేశారు. వట్టివేర్లతో ప్రత్యేకంగా దండలను స్వామి, అమ్మవార్లకు అలంకరించడం విశేషం. అనంతరం ఉత్సవమూర్తులను చక్రత్తాళ్వార్‌తోపాటు పుష్కరిణిలోకి తీసుకెళ్లారు. గోవిందనామ స్మరణలు, భక్తుల కోలాహలం మధ్య మూలమూర్తులతోసహా అర్చకులు పుష్కరిణిలో మూడు మునకలు వేశారు. భక్తులు తాము కూడా పుష్కరిణిలో మునకలు వేసి పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. స్వామి ప్రత్యేక ప్రసాదంగా ఉత్సవ మూర్తులకు లేపనం చేసిన సుగంధం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం రాత్రి వేద మంత్రోచ్చాటనల మధ్య ఆలయ ప్రాంగణంలో గరుడ పతాకాన్ని ధ్వజావరోహణం చేశారు. దీంతో కడప రాయుని బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

నేడు పుష్పయాగం: బ్రహ్మోత్సవాలు ముగిసిన సందర్భంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఉదయం స్నపన తిరుమంజనం చేయనున్నారు. సాయంత్రం 6 నుంచి టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్యుల కీర్తనలు ఆలపించనున్నారు. రాత్రి 9 గంటల సమయంలో ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి సన్నిధిలో పుష్పయాగం నిర్వహించనున్నారు.

అంగన్వాడీలకు యాప్‌సోపాలు

- మొరాయిస్తున్న మొబైల్ ఫోన్లు
- సాంకేతిక సమస్యలతోసతమతం
- పిల్లల వివరాల నమోదుకు ఆటంకం





అంగన్వాడీ భవనం



కడప కోటిరెడ్డిసర్కిల్: అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలు అందిస్తున్న కార్యకర్తలను కష్టాలు వెంటాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అనేక అవస్థలు ఎదుర్కొవాల్సి వస్తోందని అంగన్వాడీ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే సాంకేతిక సమస్యల కారణంగా మొబైల్ ఫోన్లు తరుచూ మొరాయిస్తున్నాయి. జిల్లాలోని అంగన్వాడీలు రోజువారీ కార్యక్రమాలతోపాటు ప్రభుత్వం సరఫరా చేస్తున్న చిక్కీలు, కోడిగుడ్లు, బాలామృతం కేంద్రాల్లో కూరలు, ఆహారం తీసుకోవాలని చెబుతూ.. మరోవైపు మాతా శిశు మరణాలు జరగకుండా ఉండేందుకు, సుఖ ప్రసవాల కోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సమస్యలతో సతమతం

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న 3–6 సంవత్సరాలలోపు చిన్నారుల వివరాలను ప్రతిరోజు హాజరుపట్టికలో నమోదు చేయాలి. పిల్లల ఫొటో తీసి పోషణ ట్రాకర్‌యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఏరోజుకారోజు చిన్నారుల గ్రూప్ ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. కేంద్రానికి వచ్చిన తర్వాత ఉదయం నుంచి సాయంత్రంలోపు పూర్తి చేయాల్సి ఉంది. రెండు, మూడు రోజుల వ్యవధిలో ఏవైనా మార్పులు, చేర్పులు చేస్తుండడం వల్ల సాంకేతిక సమస్యలతో వర్కర్లు సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నాసిరకం ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదని పలువురు వాపోతున్నారు. మొబైళ్లు పనిచేయకపోవడంతో కొంత మంది తమ సొంత మొబైల్స్‌ను వినియోగిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమంది ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లనే వాడుతున్నారు. వాటిలో స్టోరేజీ, ర్యామ్ తక్కువగా ఉండడంతో ఫోన్ హ్యాంగ్ అవుతోందని, మరమ్మత్తులకు గురైతే కొత్తఫోన్‌ను ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

▶▶ అధికారుల బెదిరింపులు

సాంకేతిక సమస్యలతో మొబైల్‌ఫోన్లు పనిచేయక అంగన్వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా..వాటని సరిచేసేందుకు ప్రయత్నించాల్సిన అధికారులు యాప్‌లో పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయకపోతే వేతనాల్లో కోత విధిస్తున్నామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. యాప్ లోపాల వల్ల వర్కర్లు కేంద్రంలో ఉన్నప్పటికీ లోకేషన్ స్థానికంగా చూపకపోవడంతో వివరాలు నమోదు కావడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అప్‌లోడ్ చేసినా ప్రయోజనం లేదని తలలు పట్టుకుంటున్నారు. సమస్య గురించి పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడం దారుణం.

నాణ్యమైన మొబైల్స్ ఇవ్వాలి



ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు నాణ్యమైన మొబైల్స్‌ను అందజేయాలి. 95 శాతం వరకు మొబైల్స్ పని చేయక పర్సనల్ మొబైల్స్‌ను వాడుతున్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి. – ఎస్.మంజుల, గౌరవాధ్యక్షురాలు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్, కడప

అధికారమే.. అండగా..

- టీడీపీ నేతల వేధింపులు
- దళిత నాయకుడి వాటర్ ప్లాంట్ కూల్చివేతకు యత్నం
- మాసాపేటలో ఉద్రిక్తత
- ఏ ఉత్తర్వులు లేకుండా దండెత్తిన అధికారులు
- అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు హైడ్రామా



వాటర్ ప్లాంట్‌ను కూల్చి వేసేందుకు సిద్ధంగా ఉంచిన జేసీబీ



వాటర్ ప్లాంట్ వద్ద గుమికూడిన కాలనీ వాసులు



అధికారులు, పోలీసులతో మాట్లాడుతున్న మాట్లాడుతున్న మేయర్, వైఎస్సార్‌సీపీ నేతలు

కడప కార్పొరేషన్ : అధికారమే అండగా టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. వారి ఆదేశాల మేరకు అధికారులు.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా వేధింపులకు పాల్పడుతున్నారు. తాజాగా మాసాపేటలో వైఎస్సార్‌సీపీ 26వ డివిజన్ ఇన్‌చార్జి త్యాగరాజు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటును కూల్చివేసేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు యత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా, ముందస్తు నోటీసులు జారీ చేయకుండా వాటర్ ప్లాంటును కూల్చివేసేందుకు గురువారం ఉదయం సిటీప్లానర్ రమణ, ఏసీపీ మునిరత్నం ఆధ్వర్యంలో టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది మాసాపేటపైకి దండెత్తారు. వీరికి పోలీసులు అండగా నిలిచారు. అధికారుల ఏకపక్ష చర్యలపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులకు.. టౌన్‌ప్లానింగ్, పోలీసు అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ఉదయం నుంచి రాత్రి వరకూ అటు అధికారులు, ఇటు వైఎస్సార్‌పీసీ నేతలు మోహరించడంతో హైడ్రామా నడిచింది.

అధికార పార్టీ నేతల ప్రలోభాలకు లొంగలేదనే..

అధికార పార్టీ నాయకుల ప్రలోభాలకు లొంగలేదనే ఇలా కక్షసాధిస్తున్నారని 26వ డివిజన్ ఇన్‌చార్జి త్యాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మాసాపేట ప్రాంతంలో నివసిస్తున్న వారికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చేందుకు గతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి లబ్ధిదారుల ఆధార్ కార్డులను అనుసంధానం చేసి ఆన్ లైన్‌లో ఉంచారన్నారు. తన సొంత స్థలంలో ఈ వాటర్‌ప్లాంట్ ఉందని, దీనికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిధులు మంజూరు చేయగా, నగరపాలక సంస్థ ఇచ్చిన వర్క్ ఆర్డర్‌తో ప్లాంట్ నిర్మాణం చేయడం జరిగిందన్నారు. దీన్ని ఎలాగైనా కూల్చేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఉదయం నుంచి ఇక్కడే ఉన్నారని, ఇంత నీచంగా తాము చేయలేదని తెలిపారు. ఎల్లప్పుడూ అధికారం వారిదే ఉండదని టీడీపీ నాయకులు గుర్తెరగాలని హెచ్చరించారు.

జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

మాసాపేట ఎస్సీ కాలనీలో దళితులకు రూ.5లకే మినరల్ వాటర్ అందిస్తున్న వాటర్‌ప్లాంటును కూల్చేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు యత్నించిన విషయంపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు త్యాగరాజు తెలిపారు. తమపై దౌర్జన్యం చేసిన ప్రతి అధికారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇదీ నేపథ్యం..

మాసాపేట వాసులకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నది ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న డిమాండ్. గతంలో దీనిపై అనేక ఆందోళనలు, ఉద్యమాలు కూడా నడిచాయి. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అప్పుడు డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కె. సురేష్ బాబు, నగర అధ్యక్షుడిగా ఉన్న బక్కా అయ్యన్న ఆయన దృష్టికి తీసుకుపోయారు. ఇంటి స్థలాలు ఇస్తామని వైఎస్సార్ హామీ ఇచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తండ్రి ఇచ్చిన మాట మేరకు మాసాపేట వాసులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి చిత్తశుద్ధితో కృషి చేశారు. ఈ ప్రాంత సర్వే నంబర్లను క్లాసిఫికేషన్ మార్చి రెవెన్యూ వారికి అప్పగించారు. తద్వారా ఇంటి స్థలాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. వీఆర్‌ఓలంతా మూడు బృందాలుగా ఏర్పడి ప్రతి వీధి సర్వే చేసి 544 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, లే ఔట్ వేసి, ప్రతి ఇంటికీ ప్లాట్ నంబర్లు కేటాయించారు. లబ్ధిదారుల జాబితాను నగరపాలక సంస్థ జనరల్ బాడీ ఆమోదించి ఆర్‌డీఓకు పంపగా.. వారు ఆ జాబితాలో ఉన్న 35 మందికి పట్టాలు మంజూరు చేశారు. మిగతా వారికి పట్టాలిచ్చేలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో ప్రస్తుతం నిర్మించిన వాటర్ ప్లాంట్‌కు ఓనర్‌షిప్‌ను నిర్ధారించే పట్టా లేదనే ఏకైక కారణంతో అధికారులు కూల్చడానికి వచ్చినట్లు తెలుస్తోంది. అలా అయితే మాసాపేటలో పట్టాలిచ్చిన 35 మందికి తప్ప, మిగతా ఎవరికీ పట్టాలు లేనట్లు సమాచారం. సదరు వాటర్‌ప్లాంట్‌కు ఇదే నగరపాలక సంస్థ అధికారులు డోర్ నంబర్ కేటాయించి, ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేసినా.. వాటన్నింటినీ పక్కనబెట్టి కూల్చడానికి రావడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భారీ బందోబస్తు

వాటర్ ప్లాంట్ కూల్చడానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు రావడంతో సీఐలు రామక్రిష్ణ, బి. నాగార్జున ఆధ్వర్యంలో సుమారు 70 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎలాగైనా వాటర్ ప్లాంటును కూల్చివేసేందుకు వారు అన్ని రకాల యత్నాలు చేశారు. సాయంత్రం 7.30 గంటల వరకూ ఇదే తరహా డ్రామా కొనసాగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్, కిరణ్, పాక సురేష్, మల్లికార్జున, కె.బాబు, సానపురెడ్డి శివకోటిరెడ్డి, సీహెచ్ వినోద్, కంచుపాటి బాబు, షఫీ, రామక్రిష్ణారెడ్డి, రెడ్డి ప్రసాద్, ఐస్‌క్రీం రవి, తోటక్రిష్ణ, షంషీర్, రామ్మోహన్‌రెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, సుశీలమ్మ, మల్లీశ్వరి, పద్మ, శివమ్మ పాల్గొన్నారు.

పేదల నోటికాడి నీరు లాగేయడం దారుణం : మేయర్

పేదల నోటి కాడి నీరు లాగేసేలా టౌన్‌ప్లానింగ్ అధికారులు వ్యవహరించడం సరికాదని మేయర్ సురేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం ఆయన సంఘటన స్థలం వద్దకు చేరుకొని సీపీ, ఏసీపీలతో మాట్లాడారు. వాటర్‌ప్లాంట్ నిర్మాణం అక్రమమని భావిస్తే నోటీసులు ఇవ్వాలని సూచించారు. లేదా తహసీల్దార్, ఆర్‌డీఓల వద్దకు వెళ్లి రికార్డులు చూడాలని కోరారు. ఈ స్థలం రెవెన్యూకు సంబంధించినదని... కార్పొరేషన్ అధికారులకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఇన్నేళ్లలో కడపలో ఎప్పుడూ ఇలాంటి సంస్కృతి చూడలేదని, దళిత నాయకునికి చెందిన వాటర్‌ప్లాంట్ కూల్చడానికి ఇంత పంతమెందుకని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని కేబినెట్‌లో క్లాసిఫికేషన్ మార్చి రెవెన్యూ వారికి అప్పగించామన్నారు. అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి ఈ ప్రాంతాన్ని సర్వే చేసి ప్లాట్ నంబర్లు కేటాయించారన్నారు. తద్వారా 544 మందికి ఇళ్లపట్టాలిచ్చేందుకు అనుమతులు ఇచ్చారని, తాము పండగలా బహిరంగ సభ నిర్వహించి 35 మందికి ఇళ్ల పట్టాలు కూడా మంజూరు చేశామన్నారు. మిగతా వారికి ఇచ్చేలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ నేత త్యాగరాజుకు ఇచ్చిన స్థలంలో వాటర్‌ప్లాంట్ పెట్టుకొని పేదలకు రూ.5లకే సురక్షిత తాగునీరు ఇస్తుంటే.. దానిని కూల్చడానికి రావడం అన్యాయమన్నారు. నిరుపేద దళితులు సురక్షిత నీరు తాగకూడదా అని నిలదీశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి దౌర్జన్యానికి పాల్పడిన అధికారులను బోనులో నిలబెడతామని హెచ్చరించారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీలో ఆకతాయిల వీరంగం



దెబ్బతిన్న తలుపులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట సమీపంలో ఉన్న నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా రోజుకు దాదాపు 1000 మందికి వైద్య సేవలు అందిస్తున్నారు. అటువంటి ఆరోగ్య కేంద్రం ఆవరణలో కొంత మంది ఆకతాయిలు మద్యం తాగి కాంపౌండ్ వాల్, కాంపౌండ్ వాల్‌కు ఉన్న ఇనుప కడ్డీలు, తలుపులను ధ్వంసం చేశారు. ప్రతి సారి ఆకతాయిలు ఇలాగే వీరంగం సృష్టిస్తున్నారని డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగిన ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

– ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన ట్రాక్టర్, ద్విచక్ర వాహనం

చింతకొమ్మదిన్నె : మండలంలోని జమాల్‌పల్లె వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న ట్రాక్టరును కడప నుంచి రాయచోటి వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్ బోల్తా పడి, ట్రాక్టర్ డ్రైవర్ కుప్పాల జనార్దనకు తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే ఉన్న బైక్‌ను ట్రాక్టర్ వేగంగా తగలడంతో బైక్‌పై ఉన్న బత్తల సుబ్బయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి బాధితులను 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. జనార్దన కడప నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో, బత్తల సుబ్బయ్య కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. లారీ డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

పెద్ద దర్గా సమీపంలో రోడ్డు ఆక్రమణ



రోడ్డును ఆక్రమించి కడుతున్న నిర్మాణం

కడప కార్పొరేషన్ : కడప నగరం పెద్ద దర్గా సమీపంలోని మంగళ వీధిలో కొందరు రోడ్డు ఆక్రమణ చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గుడి పేరుతో ఈ ఆక్రమణ చేస్తున్నట్లు విమర్శలున్నాయి. గతంలో ఈ వివాదంపై ఇరువర్గాలు ఒప్పందాలు చేసుకొన్నట్లు తెలుస్తోంది. తాజాగా అధికార పార్టీ నాయకుల అండ చూసుకొని రోడ్డు స్థలంలో రేకుల షెడ్డు నిర్మిస్తున్నట్లు సమాచారం. ఆక్రమణలు చేయకుండా చూడాల్సిన ఒకరిద్దరు టౌన్‌ప్లానింగ్ అధికారులు వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించి నిర్మాణం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

‘కబ్జాకు వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదు’

బి.కోడూరు : మండలంలోని గోవిందాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన కబ్జా వ్య వహారంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రమేయం లేద ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రమైన బి.కోడూరులో విలేకరులతో వారు మాట్లాడారు. ఎల్లో మీడియా పత్రికల్లో ప్రతి నిత్యం పాఠశాల స్థలం కబ్జా వ్యవహారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అని రాయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడా కూడా భూ కబ్జాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్పడలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బద్వేలు, పోరుమామిళ్ళ, బి.కోడూరు మండలాల్లో కూటమి నాయకుల ఆగడాలు ఎక్కువై పోయాయని, ఎక్కడ చూసినా ఆక్రమణలు, కబ్జాలు, దందాలతోనే పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. పాఠశాలకు సంబంధించిన స్థలం ఆన్‌లైన్ వ్యవహారంలో రైతు అవగాహన లోపం కారణంగా, రెవెన్యూ అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేయకుండానే ఆన్‌లైన్ చేయడం వల్ల జరిగిన పొరపాటే తప్ప ఎవరూ కూడా కావాలని చేసినది కాదన్నారు. అలాగే ఈ విషయమై గతంలో రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయడంతోపాటు ఆ రైతు తీసుకున్న బ్యాంకు రుణాలను కూడా తిరిగి బ్యాంకులో చెల్లించడంతోపాటు ఆ భూమికి, రైతుకు ఎలాంటి సంబంధం లేదని రాతపూర్వకంగా రాయించి రెవెన్యూ అధికారులకు ఇచ్చారన్నారు. కానీ కొంత మంది కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీపై బురద జల్లేందుకు ఇటీవల జరిగిన డీఆర్‌సీ సమావేశంలో లేవనెత్తి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పత్రికల్లో వేయించి ప్రచారం చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. పాఠశాల స్థలం ఆన్‌లైన్ చేయించుకున్న వెంకటసుబ్బారెడ్డి, వెంకటసుబ్బమ్మలు ఏ పార్టీకి చెందిన కార్యకర్తలు కాదని, వారు కేవలం రైతు కుటుంబానికి చెందిన వారు మాత్రమేనని తెలిపారు. ఇకనైనా ఇలాంటి బురదజల్లే వ్యవహారాలు మానుకుని, మండల అభివృద్ధికి కృషి చేయాలని వారు సూచించారు.

భైక్‌పై లిఫ్ట్ ఇచ్చి.. దోపిడీ చేసి..

ముద్దనూరు : మోటార్‌బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి వృద్ధుడి నుంచి రూ.2 వేలు దోపిడీ చేసిన సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని కొత్త చౌటిపల్లె వద్ద అదే గ్రామానికి చెందిన లింగమయ్య అనే వృద్ధుడు గురువారం ముద్దనూరు వెళ్లడానికి వేచిఉన్నాడు. ఇంతలో మోటార్ బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి ముద్దనూరుకు వెళ్తున్నానని, అక్కడి వరకు లిఫ్ట్ ఇస్తానని తెలిపాడు. దీంతో అతను బైక్‌పై ఎక్కాడు. ముద్దనూరు గ్రామంలోకి రాకుండా బైక్‌ను బైపాస్ నుంచి జమ్మలమడుగు రహదారిలోకి మళ్లించాడు. కొంత దూరంలో బైక్ నిలిపి లింగమయ్య వద్దనున్న సుమారు రూ.2 వేల నగదును అతను బెదిరించి తీసుకుని పారిపోయాడు. బాధితుడు ముద్దనూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి సమీపంలో కూడా ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయండి



వేముల పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగిన కూటమి నాయకులు

పోలీస్‌స్టేషన్ ఎదుట చింతలజూటూరు నాయకుల ధర్నా

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వేముల మండలంలో అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని టీడీపీ, బీజేపీ బాలగంగిరెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి తదితరలు నేతలు వేముల పోలీసులను కోరారు. చింతలజూటూరు గ్రామానికి చెందిన కూటమి నాయకులు వంద మందికిపైగా గురువారం వేముల పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. టీడీపీకి చెందిన పేర్ల పార్థసారథిరెడ్డి కుటుంబం అక్రమ మైనింగ్‌కు పాల్పడుతోందని, అన్నీ తెలిసినా పోలీసులు కట్టడి చేయడం లేదని వారు ఆరోపించారు. యథేచ్ఛగా ముగ్గురాయిని వెలికి తీస్తున్నా పట్టించుకోవడం లేదని పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. వేముల మండలంలో కొనసాగుతున్న అన్ని అక్రమ మైనింగ్ కార్యకలాపాలను పోలీసులు కట్టడి చేయాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట గంటపాటు ధర్నా నిర్వహించారు. కూటమి నేతలకు మద్దతుగా బీజేపీ మాజీ అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి నిలిచారు. ధర్నా చేస్తున్న నేతలతో మాట్లాడారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. తర్వాత పోలీసులు సైతం కూటమి నాయకులతో చర్చించారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మా మైనింగ్ కట్టడి చేయడం ఏమిటీ?

‘అధికారికంగా ఉన్న మా మైన్‌ను మైనింగ్ చేయకుండా కట్టడి చేయడం, అక్రమంగా మైనింగ్ చేస్తున్న వారిని కొనసాగించడం ఏమిటీ? వారికొక్కరికే ప్రభుత్వం అండగా ఉందా? మేము అధికార పార్టీలో భాగస్వాములం కాదా?’ అంటూ చింతలజూటూరుకు చెందిన టీడీపీ, బీజేపీ నేతలు పోలీసులను నిలదీశారు. అక్రమ మైనింగ్ చేస్తున్న వారిని పార్టీలకతీతంగా కట్టడి చేయాలని, ఎవరికైతే మైనింగ్ అనుమతులున్నాయో వారిని మాత్రమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎల్లకాలం దౌర్జన్యాన్ని సహించేది లేదని ఆయా నేతలు పోలీసులకు తేల్చి చెప్పారు. తాము ఎవ్వరికీ తక్కువ కాదని, తమ మైనింగ్ కార్యకలాపాలకు అడ్డుపడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరికలు చేయడం గమనార్హం.

హోటల్‌లో తనిఖీలు

సిద్దవటం : మండలంలోని కడప–చెన్నై జాతీయ రహదారి పక్కన చాముండేశ్వరీపేట గ్రామ సమీపంలో ఉన్న బాలాజీ ఫ్యామిలీ రెస్టారెంటు హోటల్‌లో గురువారం డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ అధికారిణి గీతవాణి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ హోటల్‌లో 4 ఇండేన్ గ్యాస్ సిలిండర్‌లను గుర్తించి సీజ్ చేశామన్నారు. హోటల్ యజమాని ప్రవీణ్‌కు మార్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఈ సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీ వారికి అప్పగించామన్నారు. రెస్టారెంటు హోటళ్లలో ఇండేన్ గ్యాస్ సిలిండర్లను ఉపయోగించకూడదని అన్నారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయ్ తహసీల్దారు సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలే లక్ష్యం



ఎద్దులాయపల్లె సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ వెంకటరమణ

బ్రహ్మంగారిమఠం : వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.వెంకటరమణ తెలిపారు. బ్రహ్మంగారి మఠం మండలం మల్లేపల్లె పంచాయతీ ఎద్దులాయపల్లె దగ్గర ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ గృహ విద్యుత్ బిల్లులు తగ్గించుటకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసుకొనుటకు ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రజలు, రైతులకు ఇబ్బందులు రాకుండా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పగలు వీధిలైట్లు వెలగకుండా చూడాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్య ధోరణి వీడి విద్యుత్ సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడికి తక్షణం వెళ్లాలన్నారు. సిబ్బందిపై ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవు అన్నారు. ఎక్కడైనా విద్యుత్ వైర్లు ఎత్తు తక్కువ ఉన్న చోట మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు ఈఈ భరణీకృష్ణ, డీఈఈ కుళాయప్ప, బి.మఠం ఏఈ రవిశంకర్, జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



షేక్ బాబాజీ (ఫైల్)

వేముల : వేములలో చర్చి ఎదురుగా నివాసముంటున్న షేక్ బాబాజీ(48) అనే వ్యక్తి అప్పుల బాధతో గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్.పి.కుంట మండలం గొకనపల్లెకు చెందిన షేక్ బాబాజీ వేములలో నివాసముంటున్నాడు. వేములలో ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తుండటంతోపాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని అరటిని సాగు చేశాడు. అరటి సాగులో నష్టాలు రావడంతో అప్పులయ్యాయని, తీర్చే మార్గంలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేస్తున్నారు.

అక్రమ మద్యం పట్టివేత

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని ఎన్‌జీవో కాలనీకి చెందిన కొత్తపల్లి శ్రీనివాసులురెడ్డి, పైడి కాల్వ బాబు చంద్రన్ డిఫెన్స్ మద్యం అమ్ముతున్నట్లు తమకు సమాచారం రావడంతో దాడులు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 80 (750ఎంల్) ఫుల్ బాటిళ్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటి విలువ దాదాపు రూ.2.60 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కడప గడపన మళ్లీ సాహిత్య సంబరాలు

రేపటి నుంచి వైఎస్సార్ జిల్లా రచయితల మహాసభలు

కడప కల్చరల్ : కడప గడపన మళ్లీ సాహిత్య ఉత్సవాలు జరగనున్నాయి. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం గత సంవత్సరంలో ఏర్పాటైంది. తొలి విడతగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించిన సంస్థ ప్రస్తుతం వ్యవస్థాపక అధ్యక్షులు, యోగి వేమన విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు, పాలకమండలి సభ్యులు మూల మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో మరోమారు కడప నగరంలో రెండు రోజుల సాహిత్య సంబరాలు శని, ఆదివారాలలో నిర్వహించనున్నారు.

మరోసారి ఉత్సవాలు

నిన్నటి తరంలో ఈ ప్రాంతపు కవులు, రచయితలు జిల్లా రచయితల సంఘం, అభ్యుదయ రచయితల సంఘం పేరిట సంస్థలను ఏర్పాటు చేసుకుని విజయవంతంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఆ తర్వాత ఈ రంగంలో స్తబ్ధత ఏర్పడింది. మరికొన్నాళ్ల తర్వాత బాధితులే రచయితలై అత్యంత సహజంగా కథలను పండించారు. సరిగ్గా ఇదే సమయంలో కడప నగరంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అందులోని సాహితీవేత్తలు తొలి దశ నుంచి తమదైన శైలిలో భాష సాహిత్యాభివృద్ధికి కృషి చేసి ఆ శాఖకు పేరు గడించి పెట్టారు. ఇదే సమయంలో బ్రౌన్ గ్రంథాలయ నిర్మాత డాక్టర్ జానమద్ది హనుమత్‌శాస్త్రి, విద్వాన్ కట్టా నరసింహులు, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి ఈ రంగంలో ఆసక్తి, ప్రజ్ఞ గల వారిని ఎంతగానో ప్రోత్సహించి నూతన రచయితలుగా తయారయ్యేందుకు స్ఫూర్తినిచ్చారు.

ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు

నూతన రచయితలు అస్థిత్వ పోరాటాల ఫలితాలను అత్యంత సహజమైన కథలుగా తీర్చిదిద్దారు. దాంతో వారికి విశేషమైన పేరు ప్రఖ్యాతులు లభించాయి. వారి కథలతో సినిమాలు తీస్తామని నిర్మాతలు, దర్శకులు ముందుకురావడం విశేషం. ఇలాంటి దశలో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఏర్పడడం పట్ల సాహిత్యాభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తగినట్లు నిర్వాహకులు ఈ నెల 8, 9 తేదీలలో సభలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాచీన తరానికి చెందిన శ్రీకృష్ణదేవ రాయలతోపాటు నేటితరానికి చెందిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పేరిట కూడా ప్రత్యేకంగా 16 వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉత్సవాలలో మరికొన్ని ప్రత్యేకతలను మనం చెప్పుకోవాలి. ఈ రెండు రోజుల సభలలో మొత్తం 16 పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. ప్రతిరోజు 8 విభాగాలుగా సదస్సులను నిర్వహిస్తారు. రాయలసీమలోని అన్ని ప్రాంతాల నుంచి 120 మందికి పైగా కవులు, రచయితలు ఈ సభలకు హాజరు కానున్నారు. పాల్గొనే వారు వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం–రాయలసీమ భాగస్వామ్యం అంశంపైనే దృష్టి సారించనున్నారు. వీరితోపాటు కళాశాల నుంచి ఎంపిక చేసిన 154 మంది విద్యార్థులు ఈ సభల్లో రెండు రోజులపాటు వేదికలపై తమ కవిత్వాన్ని వినిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ సభల్లో ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, ఆచార్య శలాక రఘునాథశర్మ, ప్రముఖ శతావధాని డాక్టర్ నరాల రామారెడ్డి, సినీ నటులు శివకృష్ణలతోపాటు రాయలసీమ నలుమూలల నుంచి హాజరు కానున్నారు.

స్థల వివాదం సాకుతో వేధింపులు

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై కేసు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ గంగిరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అంకిరెడ్డిపల్లె రామిరెడ్డిపై స్థల వివాదం సాకుతో పోలీసులు వేధింపులు చేస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రామిరెడ్డి కుటుంబ సభ్యులు ఇలా తెలుపుతున్నారు. గంగిరెడ్డిపల్లె సమీపంలోని ఆనంద ఆశ్రమం వెళ్లే దారిలో సోమిరెడ్డిపల్లె గ్రామ పొలం సర్వే నంబర్ 54–5ఏలో రెండు సార్లుగా 78 సెంట్లు గంగిరెడ్డిపల్లెకు చెందిన మేకల రామయ్య దగ్గర 1998, 2002లలో కొనుగోలు చేశామన్నారు. అప్పటి నుంచి తాము ఇంటి నిర్మాణం చేసుకొని అనుభవంలో ఉన్నామని పేర్కొన్నారు. యాదవ సామాజిక వర్గం దగ్గర కొనడం తాము చేసిన తప్పా అన్నారు. అప్పటి నుంచి ఎలాంటి ఫిర్యాదులు చేయని వారు, వారికి కొంత మంది తప్పుడు సమాచారం ఇచ్చి తాము కొనుగోలు చేసిన స్థలంపై తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే తమ కుటుంబ సభ్యులపై వేధింపులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగా గురువారం పోలీసులు తమ ఇంటికి వచ్చి రామిరెడ్డిని తీసుకు పోయారన్నారు. అంతలోని 420 కేసు నమోదు చేసి ప్రొద్దుటూరు కోర్టుకు తీసుకువెళ్లారన్నారు. అయినా జడ్జి రిమాండ్‌కు తిరస్కరించడంతో 41 నోటీసులు ఇస్తామని పోలీసులు తెలిపారన్నారు. కేవలం రాజకీయ కక్షలో భాగంగానే రామిరెడ్డిపై కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయంపై ఎస్ఐ చంద్రశేఖర్‌ను వివరణ అడగగా.. గంగిరెడ్డిపల్లెకు చెందిన రామిరెడ్డి కుటుంబ సభ్యులు 54–5ఏ కొనుగోలు చేసింది 40 సెంట్లు మాత్రం రిజిస్టర్ చేయించుకున్నారని స్థలంకు చెందిన వారు ఆరోపించారు అన్నారు. ఫోర్జరీ వల్ల అదనంగా 38 సెంట్లు చేయించుకున్నట్లు ఆరోపించడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయ కక్ష లేదని, కోర్టు ఉత్తర్వుల ప్రకారం 41 నోటీస్ ఇచ్చి పంపినట్లు వివరించారు.

చౌకదుకాణం తనిఖీ

ప్రొద్దుటూరు రూరల్ : స్థానిక రామేశ్వరంలోని 89వ చౌక దుకాణాన్ని గురువారం రాత్రి విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. చౌకదుకాణంలోని నిల్వలు, పంపిణీ చేసిన రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ శివన్న, హెడ్‌కానిస్టేబుల్ బాషా పాల్గొన్నారు. మండలంలోని సోములవారిపల్లె పంచాయతీ ఈశ్వరరెడ్డినగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 బస్తాల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఇవి 800 కేజీల బరువు ఉన్నాయని, వీటిని స్థానిక పౌరసరఫరాల గోడౌన్‌కు తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున పేర్కొన్నారు. వెంట ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.